క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికలో భాగంగా పెదపాలెం, పెదకొండూరు, శృంగారపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, పెదకొండూరు సర్పంచ్ మేదర సౌజన్య, శృంగారపురం సర్పంచ్ కొండూరు సుధారాణి, జయ, ప్రసాద్, వీఏఎలు, యానిమేటర్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలలో మౌలిక సదుపాయాల కల్పన

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆర్కే రంజాన్ పండుగను పురస్కరించుకుని మసీదులు, ఈద్గాలు, బరియల్ గ్రౌండ్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దానిలో భాగంగా తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఈద్గాలో మౌలిక సదుపాయాల కోసం గురువారం పనులు చేపట్టారు. మౌలిక సదుపాయాల్లో భాగంగా బోరు ఏర్పాటు చేసి విద్యుత్ మోటారు అమర్చారు. ప్రార్థనలు చేసే సమయంలో ముస్లింలు కాళ్లు, చేతులు శుభ్రపరుచుకునేందుకు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. హిందూ శ్మశానవాటికలో కూడా బోరు ఏర్పాటు చేసి విద్యుత్ మోటారు పెట్టనున్నారు. హిందూ శ్మశానవాటిక, ముస్లిం శ్మశానవాటికల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు. శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లిలోగల ఐటీసీ కంపెనీ గురువారం అగ్ని ప్రమాదాలపై మంగళగిరిలోని అగ్నిప్రమాద నివారణ కార్యాలయ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో మంటల నుంచి ఎలా తప్పించుకోవాలో, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, అగ్ని ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎలా రక్షించాలి? వారికి ఎలాంటి చికిత్స అందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ పక్కన గల వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ మేడా బాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నపురెడ్డిలు శంకుస్థాపన చేశారు. రాష్ట్రప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం రూ.20 లక్షలు కేటాయించడంతో రూ.5లక్షల వ్యయంతో రెండో సచివాలయ పరిధిలోని 105 మీటర్లు సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పి.బాలరాయప్ప, వార్డు సభ్యులు లూర్దుమేరి ఫ్రాన్సిస్, పి.బాల సాగర్, నాయకులు పాల్గొన్నారు.

ఈద్గాకు మెరక

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని ఈద్గా ప్రాంగణాన్ని మెరక తోలి చదును చేయించారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే దుగ్గిరాలలో పర్యటించిన సందర్భంలో ఈద్గాకు గ్రావెల్ తోలించాలని ముస్లిం పెద్దలు కోరారు. ఎత్తు పల్లాలుగా ఉండడం, ప్రార్థనలు చేసుకునే సమయంలో ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే ఆర్కే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రానికల్లా ఈద్గాకు తన సొంత ఖర్చుతో గ్రావెల్ తోలించారు. వెంటనే గ్రావెల్ తోలే పనులు ప్రారంభించారని, ఈసారి రంజాన్ పండుగ నాటికి పనులు పూర్తవుతాయని ముస్లింలు తెలిపారు. సమస్యను తెలిపిన 24 గంటల్లో పరిష్కరించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పెనుమాకకు చెందిన కుక్కమళ్ల లేయమ్మ పెనుమాక- కృష్ణాయపాలెం రోడ్డులో గేదెల ఫారమ్ నుంచి పాలు తీసుకుని ఇంటికి వెళుతుండగా కృష్ణాయపాలెం నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లిందని, బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ముగిసిన సామాజిక న్యాయ చైతన్య యాత్ర

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు తెనాలి శ్రావణ్‌కుమార్ చేపట్టిన సామాజిక న్యాయ చైతన్య యాత్ర గురువారంతో ముగిసింది. తాడికొండ ఎస్సీ ఉన్నత పాఠశాలలో ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కొంద్రు మురళి, తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడారు.

ప్రాచీన సంస్కృతిని కాపాడుకోవాలి

- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- పెద కోనేరు (కళ్యాణ పుష్కరిణి) మంగళగిరికి గుండె వంటిది
- పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు సహకారం
- పెద కోనేరు పనులు పరిశీలన



పెద కోనేరును పరిశీలిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: భారతదేశ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శమని, అలాంటి ప్రాచీన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. నగర పరిధిలోని పెద కోనేరు (కల్యాణ పుష్కరిణి)లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావులతో కలసి పరిశీలించారు. అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ నగర పరిధిలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి చెందిన పెదకోనేరు (కల్యాణ పుష్కరిణి) సుమారు 500 సంవత్సరాల కిందట ఏర్పడి స్వామి వారికి నిత్య సేవలు, పూజలు, అభిషేకాలు కోనేరు నీటితో నిర్వహించే వారని చరిత్ర చెబుతుందన్నారు. అనంతరం కోనేరు స్వామి వారికి ఉపయోగపడకుండా పోవడం, ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెద కోనేరు అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్కే తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. తన వంతు సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. కోనేరు కళకళలాడుతూ స్వామి వారికి నిత్యం సేవలు జరుగుతుంటే మంగళాద్రి ప్రజలు స్వామి వారి ఆశీస్సులతో మరింత కళకళలాడుతుంటారన్నారు. సిల్టు తొలగింపులో జాప్యాన్ని నివారించేందుకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. మెట్ల నిర్మాణంతోపాటు ప్రహరీ, కోనేరులో వేంచేసియున్న ఆంజనేయ స్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు వర్షాకాలం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరు చుట్టూ ఉన్న నాలుగు రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెద కోనేరు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సిల్టు తొలగించేందుకు ఆధునిక టెక్నాలజీ కలిగిన యంత్రాలను ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 30 శాతం సిల్టు తొలగింపు పూర్తయిందని, మిగిలిన పనులు వేగవంతం చేసి మే చివరి నాటికి కోనేరు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ రామకోటిరెడ్డి, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాత బస్టాండ్ ఆవరణలో నిర్మాణం జరుపుకుంటున్న చేనేత బజార్‌ను, రాజీవ్ గృహకల్ప వద్ద తుదిదశకు చేరుకున్న చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

అవినీతి రహిత పాలనకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- కంతేరులో గడపగడపకు మన ప్రభుత్వం



కంతేరులో ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

కంతేరు(తాడికొండ): అవినీతి రహిత పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాలలోనే ఎన్నికల ముందు ఇచ్చిన 98 శాతం హామీలను నెరవేర్చి కులమతాలకతీతంగా అందరికీ అండగా నిలిచిందన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి అంటే ఓ వర్గానికో, కులానికో లేక ఓ పార్టీకో మాత్రమే పరిమితమయ్యేదని, కానీ నేడు దానికి భిన్నంగా వర్గ విబేధాలు, పార్టీ బేధాలు లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమం చేరువ అవుతుందని అన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జం మహేష్‌బాబు, ఎంపీటీసీ వలపర్ల కల్పన, నాయకులు తాళ్ల శివ నాగరాజు యాదవ్, నంద్యాల సదానందరెడ్డి, మాడా శ్రీనివాసరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన సురేష్‌కుమార్

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల దాడిలో గాయపడిన బాధితులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ నల్లిబోయిన వెంకట సుబ్బమ్మ, నల్లిబోయిన రామారావు దంపతులను గురువారం ఆయన పరామర్శించారు. సురేష్ కుమార్ పోలీసులకు ఫోన్ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తాళ్ల శివనాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌కుమార్‌ను కలసిన పొట్లపాడు సొసైటీ చైర్మన్

మేడికొండూరు మండలం పొట్లపాడు గ్రామ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాములపాటి జయరావు గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవి వచ్చేలా సహకరించినందుకు సురేష్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

- పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే
- మస్జీద్ పునఃనిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు హుస్సేన్ మస్జీద్‌లో గురువారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైనార్టీలకు పండ్లు ఇచ్చి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ముస్లింలతో కలసి నమాజ్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆర్కే మస్జీద్ పునఃనిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందని, రంజాన్ పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్ అహ్మద్, ఎండీ ఫిరోజ్, ఎస్‌కే హస్సన్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ భూముల్లో ఆక్రమణల తొలగింపు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం సీఆర్‌డీఏ భూముల్లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. యర్రబాలెంకు చెందిన కొందరు గొర్రెలకాపరులు సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలోని సీఆర్‌డీఏ భూములను ఆక్రమించి చుట్టూ ముళ్లకంపను వేసి గొర్రెలను మేపుకుంటున్నారు. అదే సమయంలో గేదెలను మేపేందుకు వెళ్లిన మహిళలపై దుర్భాషలాడటమే కాకుండా దాడులకు తెగబడుతున్నారు. దీంతో ఇటీవల పలువురు మహిళలు సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశాల మేరకు సీఆర్‌డీఏ గ్రామ సర్వేయర్ కందుకూరి పుష్పలత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు గొర్రెలకాపరులు ఆక్రమించి వేసిన ముళ్లకంపలను తొలగించారు. కార్యక్రమంలో యర్రబాలెం, కృష్ణాయపాలెం, నవులూరు వీఆర్‌ఓలు ఆయూబ్, కోటేశ్వరరావు, శివన్నారాయణ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికంగా నివాసముంటున్న బి ఆంజనేయులు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. అతని తలకు తీవ్ర గాయాలు కా గా స్థానికులు 108లో క్షతగాత్రుడిని చికిత్స ని మిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు పరారు కాగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు న మోదు చేసి పరారైన వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారిని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దర్శించుకుని పూజలుచేశారు. భక్తులకు తమ చేతుల మీదగా అన్నదానం వడ్డించారు. మహిళలు మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలో మేళతాళాల మధ్య ఊరేగింపు కనుల పండుగగా సాగింది.

మహిళలకు రంజాన్ కానుక

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల ముస్లిం కాలనీకి చెందిన ఇరువురు నిరుపేద ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే ఆర్కే రంజాన్ కానుక అందజేశారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ముస్లిం కాలనీకి చెందిన షేక్ కరీమూన్, షేక్ నాగుర్‌బీ తమ సమస్యలను విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆ ఇద్దరికి రూ.5 వేలు చొప్పునరంజాన్ కానుకగా అందించారు. వారు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: ఆటోలో తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం మంగళగిరి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు..కొందరు రేషన్ మాఫియా నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరు కుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్‌తోపాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్‌లో ఉండవల్లి బస్టాండ్ సెంటర్‌లో పైపులైను లీక్ కావడంతో గురువారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న రోడ్డులో ట్రాక్టర్లు పైపులైన్‌పై ప్రయాణించడం వల్ల లీకేజ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న సచివాలయ సిబ్బంది డీఈ కృష్ణారెడ్డి చెప్పడంతో వెంటనే ఎంటిఎంసి ఇంజినీరింగ్ సిబ్బంది చేత మరమ్మతులు నిర్వహించి తాగు నీరు వృథా కాకుండా అరికట్టారు.

నగరంలో జగనన్నే మా భవిష్యత్



మంగళగిరి: నగరంలోని ఆయా వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగుతుంది. వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. 5వ సచివాలయం పరిధిలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు. ప్రభుత్వంలో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నకు అండగా నిలవాలని గంజి కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొని సీఎం జగన్ కు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంజనం వీరాస్వామి, దామర్ల కుబేరస్వామి, చింతక్రింది గంగాధర్, తిరువీధుల కోటేశ్వరరావు, చిల్లపల్లి నాగరాజు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 15వ వార్డుతోపాటు ఆయా వార్డులు, నిడమర్రు, కాజ, ఆత్మకూరు, చినకాకాని, నవులూరు, యర్రబాలెం, పెదవడ్లపూడి తదితర ప్రాంతాల్లో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు.

టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: తన నీతి, నిజాయితీ గురించి నియోజకవర్గ ప్రజలతోపాటు టీడీపీ, నాయకులకు, కార్యకర్తలకు కూడా పూర్తిగా తెలుసునని, నాయకత్వ ఒత్తిడి తట్టుకోలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. ఎమ్మెల్యే ఆర్కే అవినీతికి పాల్పడడు... అవినీతి చేయనీయడు... అనేది జగమెరిగిన సత్యమని గుర్తుంచుకోవాలన్నారు. గురువారం నగర పరిధిలోని పెద కోనేరు (కళ్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా గ్రావెల్ తరలించి అవినీతికి పాల్పడినట్లు తనపై టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలోని డొంక రోడ్లను, లింకు రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి పర్చడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతి పొందిన తరువాతే రోడ్లకు గ్రావెల్ తోలకాలు చేపట్టామని తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా అవగాహన లేని లోకేష్ చెప్పినట్లు అసత్య ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులు మానుకోవాలని హితవుపలికారు. నియోజకవర్గంలో టీడీపీ పూర్తిగా ప్రజలకు దూరం కావడంతో ఉనికి కోసమే మీడియాను, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని తనపై అభూత కల్పనలతో ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నవులూరులోని ఎన్టీఆర్ పేరుతో కాలనీ ఏర్పడి నాలుగు దశాబ్దాలైనా రోడ్ల కోసం తట్ట మట్టి పోయలేని టీడీపీ నాయకులు తనను విమర్శించడం సిగ్గుచేటన్నారు. అదే ఎన్టీఆర్ కాలనీలో ప్రతి రోడ్డును గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి పర్చడం జరిగిందన్నారు. రోడ్లతోపాటు నియోజకవర్గంలోని శ్మశానవాటికలు, ప్రభుత్వ పాఠశాలలతో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ప్రతిచోటా గ్రావెల్‌తో మెరక తోలి స్థానికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ధైర్యం ఉంటే అభివృద్ధి పర్చిన గ్రావెల్ రోడ్లను పరిశీలించి అవినీతి జరిగి ఉంటే నిరూపించేందుకు సవాల్ చేయాలని, ఊరికే కాలయాపన కోసం, పత్రికల్లో ఫొటోల కోసం, మీడియాలో కనపడేందుకు ఆరోపణలు చేయడం తగదన్నారు. అభివృద్ధికి సహకరించి సూచనలు, సలహాలు ఇస్తే తప్పనిసరిగా వాటిని పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అనవసరమైన అసత్య ఆరోపణలతో అభివృద్ధి నిరోధకులుగా మారవద్దని హితవు పలికారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కిలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయం అందజేశారు. నూతక్కిలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న ఆళ్లమూడి కుమారి పూరింట్లో అద్దెకు నివాసముంటుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు దగ్ధమైంది. కూరగాయలు అమ్ముకునే జీవించే ఆమె కట్టుబట్టలతో బయటపడింది. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన రూ 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కూరగాయలు విక్రయించుకునేందుకు తోపుడు బండి అందజేస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆర్కేకి కుమారి ధన్యవాదాలు తెలిపింది.

నిత్యావసర సరకులు అందజేత

అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన బాధితురాలు కుమారికి ప్రభుత్వం నుంచి తహసీల్దార్ జీవి రామ్‌ప్రసాద్ బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో శ్రీనివాసరావు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ కన్వీనర్ దామేష్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు బొక్క నాని, సచివాలయం-2 కన్వీనర్ పులి భుజంగరావు, మేకా అంజిరెడ్డి, వంశీ, చిన్ని, శరత్, అన్నూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆలోచనే..ఎమ్మెల్యే ఆర్కే ఆలోచన

స్పష్టం చేసిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



మంగళగిరి: అభివృద్ధిలో దేశానికే మోడల్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయాలనే ఆలోచనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే రాష్ట్రానికే మోడల్ నియోజకవర్గంగా మంగళగిరిని అభివృద్ధి పరచాలనే ఆలోచనతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఉన్నారని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తెలిపారు. నగరంలో ఆటోనగర్‌లోకల ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో గురువారం అయోధ్యరామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పరస్తున్న ఘనత ఎమ్మెల్యే ఆర్కేది అన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఆర్కే ఎంతో కష్టపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంతోపాటు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. మంగళగిరి అంటే కమ్యూనిస్టు భావాలు ఉన్న ప్రాంతమని, కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే కమ్యూనిస్టు భావన అని అటువంటి భావన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కేకు ఉన్నాయన్నారు. రానున్న 5–10 సంవత్సరాల కాలంలో వైఎస్సార్ జగనన్న ఇళ్లు రూ 25లక్షల నుంచి రూ.30లక్షల ఆస్తిగా మారుతుందన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- డోకిపర్రు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బ్రహ్మానందరెడ్డి

మేడికొండూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని డోకిపర్రులో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవిధంగా లబ్ధి చేకూరాయనే అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభ్డివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. గత మూడున్నర ఏళ్లగా తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చిరస్థాయిలో నిలిచిపోతాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరి ఆశీర్వాదం కావాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం మరచి అధికారం లేనప్పుడు ప్రజల గురించి మాట్లాడే పార్టీలను నమ్మవద్దని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనికస్తున్నారని అన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ షేక్ అబ్బాస్, ఉడతా శ్రీనివాసరావు, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు నోసిన రామకోటమ్మ, జె.నాగేశ్వరరావు, కోటి, కొండపోగు కోటేశ్వరరావు, ముత్యాల బాలస్వామి పాల్గొన్నారు.